# మాండలికాలు

# మాండలికాలు

## విషయం యొక్క ఔచిత్యం

మాండలికాలు ఒక ప్రాంతం యొక్క ఉనికిని, భాష యొక్క ఉనికిని, సంస్కృతిని కాపాడతాయి. భాషకు అందాన్నిచ్చేవి యాసలు. ఆయా భాషల్లో కలిగే మార్పులు మాండలికాలను సూచిస్తాయి. ఒక ప్రాంతాన్ని బట్టి వ్యవహరించబడే మాండలికాలు ఆ సంస్కృతిని, ఆచారాలను, సంప్రదాయాలను నిలబెడతాయి. నశించిపోతున్న మాండలికాలను తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకురావడం దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

## ఉపోద్ఘాతము

భాష వాగ్రూపమైంది. భావ ప్రకటనలో భాష అతిముఖ్యమైనది. అత్యంత శక్తివంతమైంది కూడా. సమాజంలో మానవులు తమ భావాల్ని ఇతరులకు తెలియజేయడానికి ఇతరుల భావాల్ని తాము తెలుసుకోడానికి నిత్యం వ్యవహరించే ఉచ్ఛారణ సాధనమే భాష. అసలు మానవ సమాజంలో భిన్న సంస్కృతికి చెందినవారు, భిన్న కులాల, మతాల వారు కలిసి మెలిసి జీవిస్తారు. వీళ్ళందరిని ఒకటిగా చేసి సాంఘిక జీవనంలో సన్నిహితుల్ని చేసేది భాష మాత్రమే.

భాష నిత్యం పరిణామం చెందుతూనే ఉంటుంది. భాష సజీవ వ్యవస్థకు చెందింది. కాబట్టి మార్పు అనేది భాషకు సహజం. ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, వృత్తి, కాల భేదాల్ని బట్టి ఒకే భాష విభిన్న రకాలుగా వ్యవహరించబడితే, ఆ భాషలో మాండలికాలు ఏర్పడతాయి. ఈ విధమైన మాండలికాలు ప్రపంచ భాషలన్నింటిలోనూ ఉంటాయి.

## మండలము

మండలమంటే దేశ భాగమని అర్థం. ఒకేజాతి ప్రజల్నికానీ, సంఘాన్ని కానీ మండలమని పిలుస్తారు. మండలానికి 'జిల్లా', 'రాశి', 'సమూహం', 'గుంపు' అనే అర్థాలు కూడా ఉన్నాయి. నిర్ణీత జనసముదాయానికి లేదా పరిమిత వ్యవహార ప్రాంతానికి మండలమని పేరు. 'మండలం' అనేది సంస్కృత పదం.

## మాండలికము

మండల సంబంధమైంది మాండలికం. ఒకే భాషకు చెందిన భిన్న భిన్న ప్రాంతాల్లోని భాషా భేదాల్ని మాండలికాలుగా పిలుస్తారు. ఒకే భాషకు ప్రజల వ్యవహారంలోనూ, పదాల్లోనూ, వాటి ఉచ్ఛారణలోనూ, ప్రత్యయాల్లోనూ, పదాల అర్థాల్లోనూ, వ్యాకరణంలోనూ, వాక్య రచనలోనూ, భేదాలు ఉంటాయి. ఒకే భాషకు ఉన్న ఇలాంటి భేదాల్ని '' మాండలికాలు'' అని అంటారు.

'మాండలికం' ను వేదం వెంకటరాయశాస్త్రి గారు '' మాండలిక భాష'' అని వ్యవహరించారు. భాష విశాలమైంది. మాండలిక భాష పరిమితమైంది.

## నిర్వచనము

భాష వ్యవహర్తల్లో ఎక్కువ స్థాయిలో వున్నవారి మాండలిక భాషను ''ప్రామాణిక మాండలికం'' (Standard dialect) అని అంటారు. తక్కువ స్థాయిలో వున్నవారి మాండలిక భాషను ''న్యూన ప్రామాణిక మాండలికం'' (Sub-standard dialect) అని అంటారు. దీనికి సంబందించి కొందరు భాషాశాస్త్రవేత్తల అభిప్రాయాలు పరిశీలిద్దాం.

## హిమనీ

"Sub divisions of a language are referred to as dialects "

- Historical Linguistics an Introductions, P. 3

భాషలోని ప్రాంతీయ భేదాల్ని మాండలికాలని అంటారు.

## ఆచార్య పి.ఎస్. సుబ్రమణ్యం

ఒకే భాషకు ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి ఉచ్ఛారణలోనూ, ప్రత్యయాలోనూ, పదాల అర్థాలలోనూ, భేదాలు వుండి ఆ భాషలో రకాలు ఉంటాయి. ఒకే భాషకు వున్న ఇలాంటి రకాల్ని ''మాండలికాలు'' (dialects) అని అంటారు.

– ఆధునిక భాషాశాస్త్ర సిద్దాంతాలు – పుట. 159

## మాండలిక స్వరూపము

మాండలిక భాషను ''ఉపభాష'', ''ప్రాదేశిక భాష'' అని కూడా అంటారు. మాండలిక భాషను ఆంగ్లంలో ''డైలక్ట్'' (dialect) అని అంటారు. భాషలో వుండే ప్రాంతీయమైన భేదాల్ని అధ్యయనం చేయడాన్ని '' dialectology'' అని అంటారు. ఈ "dialect" అనే ఆంగ్లపదం ఫ్రెంచి "dialecte'' అనే పదం నుంచి ఏర్పడింది. ఫ్రెంచి dialecte అనే పదం లాటిన్ "dialectus" నుండి వచ్చింది. "Dialectus" లాటిన్ పదం "dialectos" అనే గ్రీకు పదం నుండి వచ్చింది.

## మాండలిక భాష – పరిశోధన

పాశ్చాత్య దేశాల్లో ప్రారంభంలో 1881 లో జర్మనీ భాషకు చెందిన భాష భేదల్ని గూర్చి జార్జ్ వెంకర్ అనే ప్రముఖ భాషవేత్త మొదటగా కృషి చేశాడు. అయితే ఆయన అధ్యయనం శాస్త్రీయ రీతిలో కొనసాగలేదు.

పెక్కుమంది భాషా వెత్తల కృషి ఫలితంగా 1943 నాటికి విదేశాల్లో మాండలిక భాషలపై విశేష పరిశోధన జరిగింది. తర్వాత మాండలిక పటాలు ప్రకటించబడ్డాయి. ప్రపంచ భాషల్లో మాండలిక భాష పరిశోధన ఎక్కువగా ఇంగ్లాండులో జరిగింది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మాండలిక పరిశీలన జరిపిన ఘనత కేరళ రాష్ట్రానికి దక్కుతుంది.

## మాండలికాలు –ప్రధాన లక్షణాలు

1. ప్రధాన భాషల్లో, ప్రామాణిక భాషల్లో భాగంగా ఉండడం.
2. భాష వ్యవహర్తల మధ్య పరస్పర అవగాహన (Intelligibility) క్షమత్వం కోల్పోకుండా వుండడం.
3. పరిమిత ప్రదేశంలో అంటే నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే వ్యవహరించడం.
4. ముద్రించిన ప్రామాణిక సాహిత్యం లేకపోవడం.
5. న్యూన ప్రామాణికం (Sub-standard) గా ఉండడం.
6. పరిసర భాషల్లోని పదాల్ని గ్రహించి, ప్రామాణిక పదాలకు బదులుగా వాడడం.

## మాండలికాలు ఏర్పడేతీరు

మాండలిక భాషల ఆవిర్భావానికి కాలక్రమంగా భాషల్లో కలిగే మార్పులు, భాషా వ్యవహర్తలు వలసపోవటం ప్రధాన కారణాలుగా కన్పిస్తున్నాయి. మాండలిక భాషలు ప్రదేశాన్ని బట్టి కాలాన్ని బట్టి, ఏ విధంగా ఏర్పడ్డాయో ఇండో – యురోపియన్ భాషల్ని, ద్రావిడ భాషల్ని పరిశీలించిన తర్వాత మనకు అర్ధమవుతుంది. ద్రావిడ భాష వ్యవహర్తలు క్రీ.పూ. 3000 సంవత్సరకాలం నుంచి ఉత్తర భారతదేశం మధ్య భారతదేశానికి తర్వాత దక్షిణ భారతదేశానికి వచ్చారు. మూల ద్రావిడ భాషలో ప్రధానంగా ఉత్తర ధ్రావిడ భాషలు, మధ్య ద్రావిడ భాషలు, దక్షిణ ద్రావిడ భాషలు అనే మూడు మాండలికాలు ఏర్పడ్డాయి. ఒకే భాష కుటుంబానికి చెందిన భాషలైనప్పటికీ ఇద్దరు వ్యక్తుల మధ్య మాట్లాడేటప్పుడు ఏమాత్రమూ అవగాహన లేక వారు మాట్లాడే భాషల్ని భిన్న భాషలుగానే భావించాలి. ఈ రీతిగా ఒకే భాష పలు భాషలుగా మారడానికి అవకాశం వుంది. శభ్ధార్ధ పరిణామాలు భిన్నభాషల ఆవిర్భావానికి కారణాలయ్యాయి.

## మాండలికము లక్షణాలు

1. వ్యవహర్తల సంఖ్య పెరగడం.
2. వ్యవహార ప్రాంతం పెరగడం.
3. మాతృభాషా ప్రాంతం నుంచి దూరం అవడం.
4. కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో కొత్త భాషలతో కలవడం.
5. నగరాలు, రాజధానులుగా ఏర్పడడం, ఆ నగర భాష ప్రామాణికం కావడం.

6. ప్రజల విద్యా సంస్కారాదుల్లో భేదం వుండటం.
7. భిన్న వృత్తుల్ని అవలంబిస్తూ వుండటం.
8. ఒకే భాషా ప్రాంతం, రాజకీయంగా భిన్న సీమలుగా విడగొట్టబడటం వల్ల కూడా మాండలికాలు ఏర్పడ్డాయి.
9. వ్యవసాయ, చేనేత, జాలరి, కుమ్మరి, కమ్మరి మొదలైన వృత్తుల వారు వాడకునే పనిముట్లను, చేసే పనులనూ, సూచించే పదాలు ఆయా వృత్తులకూ, ఆయా ప్రాంతాలకు పరిమితమై ఉండడం.
10. ఒకే ప్రాంతంలోనికి ప్రజలు విభిన్నమై సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు చెందిన వార్తై వుండాలి.
11. ప్రాచీన కాలంలో రాకపోకలకు సరైన సదుపాయాలు లేకపోవడం కారణంగా భాషా వ్యవహారాల పరస్పర సంబంధాలు సన్నగిల్లి భాష వ్యవహారంలోని సమరూపత లోపించి మాండలికాలు ఏర్పడతాయి.
12. ఒక ప్రాంతానికి వలస వెళ్ళి, స్థిరపడితే పరిస్థితులకు అనుగుణంగా భాష మారుతుంది. భాషా వ్యవహర్తలు వలస వెళ్ళేటప్పుడు ఆయా ప్రాంతాల్లో వేరే విధంగా వున్న వాతావరణం, బాషా ప్రభావం వల్ల మాండలికాలు ఏర్పడ్డాయి.
13. భాష మార్పుకు లోనుకావడం సహజం. భాషలో శబ్దార్థాల మార్పులు చోటుచేసుకుంటాయి. భిన్న ప్రాంతాల ప్రజల భాషలో శబ్ధార్థాల పరిణామం చెందిన కారణంగా ఒకే భాషలో భిన్న మాండలికాలు ఏర్పడతాయి.
14. ఇప్పుడు మనకు వున్న రేడియోలు, టీ.వి.లు, వార్త పత్రికలు, సినిమాలు, టెలిఫోన్‌లు మున్నగు ఆధునిక సౌకర్యాలు పూర్వం లేవు.

## మాండలికాలు – వర్గీకరణ

ఒక ప్రాంతాన్ని సమగ్రంగా నిశితంగా పరిశీలించాలంటే ఆ ప్రాంత భౌగోళిక, చారిత్రక, సాంఘిక, అనే విదాలుగా వర్గీకరించవచ్చు.

## ప్రాంతీయ మాండలికం

| పూర్వ మండలం | దక్షిణ మండలం | ఉత్తర మండలం | మధ్య మండలం |
|---|---|---|---|
| కళింగ ప్రాంతం | రాయలసీమ ప్రాంతం | తెలంగాణ ప్రాంతం | ఇతర కోస్తాలు |

| | | | |
|---|---|---|---|
| చోడి | రాగి | తమిదె | తమిదె |
| గోంగూర/ | గోగాకు | పుంటికూర/ | గోంగూర |

| | | | |
|---|---|---|---|
| జనపకూర | | పుంటుకూర | |
| ఆనపకాయ | సొరకాయ/<br>ఆనబకాయ | ఆనెగెంకాయ | సొరకాయ/<br>ఆనకోపాక |

## సామాజిక మాండలికములు

సందమామ – చందమామ

రిచ్చా – రిక్షా

లచ్చ – లక్ష

కోక – చీర

బువ్వ – భోజనం

రైక – రవిక

## చారిత్రక మాండలికం

చారిత్రక ఆధారాల్ని బట్టి ఒకే కాలంలో వున్న రూపాలకు కాలంతరంలో ఏర్పడ్డ తుల్య రూపాలకు మధ్య చాలా తేడాలున్నాయి.

ఉదాహరణకు ''వాడు'' అనే పదం అవన్టు–నాన్టు–వాండు, వాడుగా రూపాంతరం చెందింది.

''తూర్పు'' అనే పదం తూలుగు, తూలుపు, తూపునే, తూర్పుగా రూపాంతరం చెందింది.

## జీవశాస్త్రానుసార మాండలికం

రెండు రకాలుగా ఉంటుంది.

1. వయస్సును బట్టీ ఏర్పడ్డ మాండలికం.
2. పిల్లలు, యువకులు, వృద్ధులు మాట్లాడే భాషల్లో అనేక మాండలికాలున్నాయి.

## పిల్లల మాండలికం

బువ్వ /అన్నం/

పాచి /పాలు/

లాల /నీళ్ళు/

బూచి /దెయ్యం/

## యువకులు మాటలాడే మాండలికం

మొనగాడు

సోగ్గాడు

బీటుకొడుతున్నాడు

అంతసీనులేదు

ఫిగర్ బాగుంది

## వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1. | కట్టకు | కట్టబాక | – | కట్టబాకు |
| | | కట్టబోక | – | కట్టబోకు |
| | | కట్టమాక | – | కట్టవాక |
| | | కట్టాక | – | కట్టాకు |
| 2. | తినకు | తినబాక | – | తినబాకు |
| | | తినబోక | – | తినబోకు |
| | | తినమాకు | – | తినవాక |
| | | తినాక | – | తినాకు |

## పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలు

## తమిళ పదాలు

సాంబారు (పులుసు) తలకాని (దిండు, తలగడ)

సాపాటు (భోజనం) వరుమానం (ఆదాయం, రాబడి)

## కన్నడ పదాలు

పుంటకూర (గోంగూర) ఉద్దెర, ఉద్దులు (మినుములు)

మడక (నాగలి) అంగడి (కొట్టు)

## మరాఠి పదాలు

చెకకాబండి (గూడుబండి) గిరిక (బావిగిలక)

గుంగురు (మువ్వ) పాలె (మేడి)

## ఒరియా పదాలు

| | |
|---|---|
| బేసి (కుక్క) | కంబారి (కింకరి, పాలేరు) |
| పెయ్య (దూడ) | బుగత (యజమాని) |
| బంద (చిన్న చెరువు) | పకాలి (వేడిగంజి అన్నం) |
| ఉభాల (ఊడ్పులు) | పైన (దువ్వెన) |

## ఇల్లుకు సంబంధించిన పదాలు

| | | | |
|---|---|---|---|
| గొలుసు | చిలుకు | గొండ్లెం | గొళ్ళెం |
| గునపం | గడ్డపార | గడ్డపార | గడ్డపార/గునపం/గడ్డపలుగు |
| ఎలుగు | కంచె | కంచె | కంచె/దడి |

## క్రియా పదాల్లో మాండలిక భేదాలు

| పూర్వ మండలం | దక్షిణ మండలం | ఉత్తర మండలం | మధ్య మండలం |
|---|---|---|---|
| కళింగ ప్రాంతం | రాయలసీమ ప్రాంతం | తెలంగాణ ప్రాంతం | ఇతర కోస్తాలు |

| | | | |
|---|---|---|---|
| వచ్చేశాడు | వచ్చినాడు | వచ్చిండు | వచ్చేడు |
| తెచ్చేశాడు | తెచ్చినాడు | తెచ్చిండు | తెచ్చేడు |
| కట్టేశాడు | కట్టినాడు | కట్టిండు | కట్టేడు |

## భావార్థక ''ట'' ప్రత్యయం ''డ'' గా మారడంః

| | |
|---|---|
| తినటం | తినడం |
| కనటం | కనడం |
| చూడటం | చూడడం |
| అడగటం | అడగడం |
| పోవటం | పోవడం |
| చెప్పటం | చెప్పడం |

## ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న సముదాయాలు

అల్లుని తోలుకొని వస్తా ( తెలంగాణ )

అల్లుని తీసుకుని వస్తా ( ఇతర ఆంధ్రప్రాంతాలు)

## ఒకే శబ్దం, ఉచ్ఛారణ భేదాల్లో వుండడం

1. గుండి – బొత్తం – బొత్తాను – బొత్తాయి
2. బకెట్ – బకెట్టు – బాల్టీ – బాల్సా – బాల్చీ – బాల్టు
3. దువ్వెన – పన్ని – పన్నం – పన్య – పైన

## తెలంగాణలో ప్రాచుర్యంలో ఉన్న మాండలికాలు

బువ్వ – అన్నం

కరివేపాకు – తాల్పాకు

కార్జం – కాలెయం

అర్రాసు – వేలంపాటు

పయ్య – టైరు

బేస్తారం – గురువారం

పిరం – అధిక ధర

ఖుషి – అతి సంతోషం

బుగులు – భయం

సల్ల – మజ్జిగ

చేను – పొలం

యాడాది – ఒక సంవత్సరం

శాన – చాలా

సప్పుడు – శబ్ధం

సర్వ – బిందె

నాచు – పాకురు

తొక్కు – పచ్చడి

మిత్తి – వడ్డీ

దగడు – వేడి

ఇజ్జత్ – పరువు

| | | |
|---|---|---|
| అంట్లు | – | మెతుకులు |
| బోళ్ళు | – | వంటపాత్రలు |
| ఖలం | – | పాపము |
| పోషాకులు | – | పెళ్ళిబట్టలు |
| బంకులు | – | ఇంటి ముందు ఎత్తుగా కట్టిన అరుగులు |
| నారాజు | – | బాధ, అసంతృప్తి |
| లేవడి | – | బీదరికం |
| రేతి | – | ఇసుక |
| అస్తరణం | – | పరుపు |
| పటము | – | వస్త్రము |
| సింగిండి | – | ఇంధ్రధనుస్సు |
| అంగరుహం | – | వెంట్రుక |
| అడలిగీము | – | అగచారం కోతి |
| ఇలువిందు | – | అతిధి |
| ఇవిక | – | భూమి |
| కకందం | – | బంగారం |
| కపం | – | పశువు |
| చెలగం | – | సాలె పురుగు |
| జుగులం | – | విషం |
| వక్రపుచ్చం | – | కుక్క |
| ఆమపాత్రం | – | పచ్చికుండ |
| కాయి | – | మాంసం ముక్క |
| ఆ బాదీ | – | జనం నివసించే స్థలం |
| గాయి గాయి | – | అల్లరి అల్లరి |
| కరివెపాకు | – | కల్యమాకు |
| నిత్తె | – | రోజు |
| పిరెం | – | అధిక ధర |
| ఉనుకు | – | వరిపొట్టు |
| కందిలి | – | లాంతరు |
| కీస | – | జేబు |

| | | |
|---|---|---|
| తొగరులు | – | కందులు |
| చెవులకాయ | – | గోరు చిక్కుడు |
| పలంగు | – | మంచం |
| సాలె | – | బడి, పాఠశాల |
| అగ్గువ | – | చౌక |
| గోందు | – | జిగురు |
| గేరి | – | వీధి, వాడ |
| తుప్పలు | – | వెంట్రుకలు |

## మాండలికాలు – భేదాలు

ఒకే భాష అది వ్యవహరించబడే భౌగోళిక స్థితిగతుల్నిబట్టి, దాన్ని వ్యవహరించే మనుష్యుల వివిధ స్థాయిల్ని బట్టి భిన్నత్వాన్ని సంతరించుకోగా, ఆ భిన్నత్వాన్ని పరిశీలించే శాస్త్రమే మాండలిక భాష విజ్ఞానం.
భాష వ్యవహర్తల్లోని భిన్న భిన్న వృత్తుల్లి బట్టి ప్రాంతీయ భేదాల్ని బట్టి స్త్రీ, పురుష భేదాల్ని బట్టి, సంఘంలోని స్థాయిని బట్టి, చదువుని బట్టి, సంస్కారాన్ని బట్టి, సంఘంలోని స్థాయిని బట్టి, చదువును బట్టి, సంస్కారాన్ని బట్టి, ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు ఏర్పడ్డాయి.

## మాండలిక భేదాలు

1. వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు
2. క్రియారూపాల్లో మాండలిక భేదాలు
3. భావార్ధక ''ట'' ప్రత్యయం ''డ'' గా మారడం
4. ఒకే శబ్దం ఉచ్ఛారణ భేదాల్లో వుండటం
5. వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు
6. పరిసర భాషా ప్రభావం

## వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు

| పూర్వ మండలం | దక్షిణ మండలం | ఉత్తర మండలం | మధ్య మండలం |
|---|---|---|---|
| కళింగ ప్రాంతం | రాయలసీమ ప్రాంతం | తెలంగాణ ప్రాంతం | ఇతర కోస్తాలు |

## వ్యవసాయ పదాలు

| | | | |
|---|---|---|---|
| లాంగలం | నాగలి | నాగేలి/మడక | నాగలి |
| పేడ | పేడ | పెండ | పేడ |
| గేద | ఎనుము | పశువు | ఏదె/ బర్రె / గొడ్డు |
| గాబు | కలుపు | కలుపు | కలుపు |
| నక్క | కర్రు | కర్రు | కర్రు |

## చేనేత పదాలు

| | | | |
|---|---|---|---|
| రాట్నం | రాట్నం/ రాటకం | రాట్నం | రాట్నం |
| పోము | పోగు | పోగు | పోగు |

## మాండలికాలు - లక్ష్యాలు

1. మాండలికాలు సేకరించడం వలన మన భాషను సంరక్షించుకోవచ్చు
2. భాషతో ముడిపడిన సంస్కృతిని పరిరక్షించుకోవచ్చు
3. మాండలిక పదాలను సేకరించడం వలన ఆ మాండలిక యాసలోనే పాఠ్య ప్రణాళికను ఏర్పాటు చేయవచ్చు.
4. మాండలికాలను సేకరించడం వలన తక్కువ స్థాయి చదువుకున్న వారిని సామాజికంగా, రాజకీయంగా చైతన్యవంతం చేయవచ్చు.
5. గత చరిత్రను అధ్యయనం చేయవచ్చు.

## మాండలికాలు – పరిశీలన పద్ధతులు

**మాండలిక పరిశీలన పద్ధతులు ఇవి**

- **a.** ఏదో ఒక పదాన్ని తీసుకుని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం.
- **b.** దేశమంతటా ఒకే శబ్దం ఉచ్చారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం.
- **c.** వ్యాకరణ ప్రక్రియల్ని వాటి విశేషాల్ని సేకరించడం.

## ఏదో ఒక పదాన్ని తీసుకుని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం

ఒకే అర్థం తీసుకొని మిగిలిన ప్రాంతాల్లో ఆ పదానికి ఏ మాట వాడుతారో ప్రతీ పల్లెకి తిరిగి సేకరించడం, ''నాగలి'' అంటే పొలం దున్నే పనిముట్టు. దీనికి నాంగలి, నాగెలు, నాగేలు, మడక పదం తప్ప మిగిలిన పదాలన్నీ ఇంచుమించు రూపాంతరాలు. అంటే చారిత్రకంగా ఒకే ప్రాచీన శబ్దం నుంచి ఏర్పడినవని నిర్ధారించవచ్చు. 'నాంగేల్' అనేది ప్రాచీన రూపం. ''మడక'' దానికి పర్యాయపదం.

## దేశమంతటా ఒకే పదం ఉచ్ఛారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం

1. పన్ని – పన్నె – పన్య – పైన
2. నాగలి – నాగల – నాంగలి – నాగెలి – నాగేలి – నాగేలీ
3. బొత్తం – బొత్తాను – బొత్తాం – బొత్తాయి
4. తిరగమోత – తిరగమాత – తిరగబోత – తిరగబాత

## వ్యాకరణ ప్రక్రియల్ని – వాటి విశేషాల్ని సేకరించడం

1. క్రియా రూపాల్లో మాండలిక భే దం గుర్తించడం
2. వ్యతిరేకార్థంలో భిన్న మండలాల్లో భిన్న రూపాలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.
3. భావర్థకాల్లో గుంటూరు ప్రాంతానికి, ఇతర ప్రాంతానికి చాలా తేడాలు కన్పిస్తున్నాయి.
4. ఇంకా నామవాచకాల్లో, సర్వనామాల్లో, అవ్యయాల్లో భిన్న మండలాల్లో భేదం కన్పిస్తుంది.

## అవగాహనకు వచ్చినవి/ గుర్తించిన ప్రయోజనాలు

మాండలికాల వల్ల అనేక ప్రయోజనాలున్నాయి.

1. మాండలికాలు భాషకు సజీవ చిహ్నాలు. జీవభాషకు మార్పులు సహజం. కాబట్టి ఈ మార్పు వల్ల భాష రూపాన్ని గ్రహించడమే ప్రత్యేకతగా చెప్పవచ్చు.
2. భాష స్వరూపాన్నే కాక భాష చరిత్రను కూడా మాండలికాల వల్ల తెలుసుకోవచ్చు.
3. మాండలిక పరిశోధన వల్ల ప్రత్యేక నిఘంటు నిర్మాణం చేయవచ్చు.
4. ఒకే పదానికి గల ఉచ్ఛారణ, అర్థభేదాల్ని సులభంగా గుర్తించవచ్చు.
5. మాండలికాల వల్ల ప్రాచీన గ్రంథాల్లో వచ్చిన పదాలకు స్పష్టార్థ నిరూపణ సాధ్యమవుతుంది.
6. మాండలికాల ద్వారా సాంఘీక, రాజకీయ చరిత్రకూ భాషకు వున్న పరస్పర సంబంధాన్ని తె లుసుకోవచ్చు.
7. ఒక ప్రాంతంలో వ్యవహారంలో లేని పదాల్ని మాండలిక వ్యవహార ప్రాంతం సమకూర్చుకోవడం ద్వారా ప్రధాన భాషను సుసంపన్నం చేయవచ్చు.
8. రానురాను మాండలికాలు, ప్రామాణిక భాషలో ప్రవేశించాక కాలక్రమేణా నశిస్తాయి.

## 9. విశ్లేషణ

1. భాష ప్రవహిస్తున్న నది లాంటిది. నది ప్రవాహంలో పాత నీరు పోయి కొత్త నీరు వచ్చినట్లే ఆ భాషలో ప్రచారంలో లేని పదాలు అంతరించి దేశ, కాల శాస్త్ర సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా నూతనమైన పదాలు వచ్చి చేరుతాయి. ఈ మాండలిక పరిశోధన వలన పూర్వ భాష రూపాన్ని గ్రహించడమే ప్రత్యేకతగా చెప్పవచ్చు.
2. భాష స్వరూపాన్నే కాక భాష చరిత్రను తెలుసుకోవచ్చు. తద్వారా ఆ భాష ఏ కాలం నుండి మనుగడలో ఉంది, ఆ భాష యొక్క సాహిత్యాన్ని కూడా తెలుసుకోవచ్చు.
3. ఈ మాండలిక పరిశోధన వలన ప్రత్యేక నిఘంటువు నిర్మాణం చేయవచ్చు. తద్వారా భావి తరాల వారికి మన యాసతో పాటు మన సంస్కృతి (పండగలు, ఆచార సంప్రదాయాలు మొ.)ని కూడా అందించిన వారమవుతాయం.
4. ఈ పరిశోధన వలన ఒకే భాష కలిగిన వారు ఒక పదాన్ని ఏ ప్రాంతంలో ఏ విధంగా ఉచ్ఛారణ చేస్తారో స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా ఆ ఉచ్చరించే వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వారో స్పష్టంగా తెలుసుకోవచ్చు.
5. మాండలికాల పరిశోధన వలన మన ప్రాచీన సాహిత్యంలో కవుల, రచయితల ప్రాంత వివాదాలను రూపు మాపవచ్చు.
6. ఈ పరిశోధన వలన అన్ని పాంతాల మాండలిక పదజాలం తెలిస్తే మారుతున్న దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా నూతన పదాలు సృష్టించుకుని ప్రధాన భాషను సుసంపన్నం చేస్తూ అన్ని రంగాలకు విస్తరింపచేసుకోవచ్చు.

## ముగింపు

మాండలిక పరిశీలన వల్ల భాషకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ మాండలికాలు భాషకు వైవిధ్యాన్ని, సౌందర్యాన్ని పెంపొందిస్తాయి. ఒకే పదానికి గల ఉచ్ఛారణ, అర్థభేదాల్ని సులభంగా గుర్తించవ్చు. ఒకే కాలంలో ఏకరూపంగా వున్న పదాలు కాలక్రమంలో భిన్న రూపాలుగా స్థిరపడతాయన్న విషయాన్ని తెలుసుకోవచ్చు. మాండలికాల ద్వారా సాంఘీక, రాజకీయ చరిత్రకు భాషకు ఉన్న పరస్పర సంబంధాన్ని తెలుసుకోవచ్చు. మాండలిక వ్యాప్తిని అనుసరించి సాంఘీక, రాజకీయ హేతువుల్ని కూడా గ్రహించవచ్చు. ఈ విధంగా మాండలికాల గురించిన విస్తృత పరిశోధన చేయడం వల్ల నేటి తరానికి మాండలికాలను పరిచయం చేయగలుగుతాం.

## సంప్రదించినగ్రంథాలు


తెలుగు భాష చరిత్ర – వెలమల సిమ్మన్న

తెలుగు భాష చరిత్ర – భద్రిరాజు కృష్ణమూర్తి